క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మైలవరం: మండలంలోని వెల్వడం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గణపవరం ఏఈ సీహెచ్ రామమోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

తిరువూరు పట్టణంలో..

తిరువూరు: విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరువూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ టౌన్ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు, డ్రైవర్స్ కాలనీ, శాంతినగర్, సుగాలీకాలనీ, దారా టౌన్ షిప్, జాషువా చర్చి ప్రాంతం, అశోక్‌నగర్, ఎరుకల కాలనీ, సూర్య రెస్టారెంట్ ప్రాంతం, తోకపల్లి, కొత్త కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ ఊరేగింపు



విస్సన్నపేట: దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన బతుకమ్మను శనివారం రాత్రి మహిళలు తలపై పెట్టుకొని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ కోలాట నృత్యం చేస్తూ గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

150మందికి వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో ఆదివారం మార్గదర్శి లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ చైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా హాస్పిటల్ వైద్య బృందం 150మందికి బీపీ, మధుమేహం, ఊపిరితిత్తులు, అల్సర్, సాధారణ, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నలకుర్తి నళిని ఆశాలత, స్థానికులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ గురించి క్విజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకులు చరిత్రలో తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి నెలా చివరి ఆదివారం క్విజ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. క్విజ్‌ను మాస్టర్ దేవ్, దుర్గా భవాని నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి నాలుగో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులను ఆకట్టుకుంది. గాంధీజీ వేషధారణతో అలరించిన ఉమాను గ్రంథాలయ అధికారి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.

అన్నను వెన్నుపోటు పొడిచిన ఘనత చిన్నిది

ఎంపీ చిన్నిపై తిరువూరు వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చలమాల సత్యనారాయణ తదితరులు

తిరువూరు: తన సొంత అన్నను వెన్నుపోటు పొడిచిన నీచమైన చరిత్ర కలిగిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వైఎస్సార్ సీపీ నేతలను విమర్శించడం సిగ్గుచేటని ఆ పార్టీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం తిరువూరులో టీడీపీ కార్యాలయ ప్రారంభం సందర్భంగా ఎంపీ చిన్ని మాజీ మంత్రి పేర్ని నానీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌లపై విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో చలమాల సత్యనారాయణ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరువూరు తెలుగుదేశం పార్టీలో గ్రూపు రాజకీయాలు సృష్టించడం, విలువైన ఖనిజ సంపదను దోచుకోవడం, ఇసుక, మట్టి దందాలు నడపడం ఎంపీ చిన్నీకే చెల్లుబాటైందని విమర్శించారు. ఎన్నడూ లేని అశాంతియుత వాతావరణాన్ని తిరువూరులో సృష్టించిన ఘనతను చిన్ని దక్కించుకున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ మనుషులే తిరువూరులో గంజాయి అమ్ముతున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు పోలీసుస్టేషన్‌లో బహిరంగ వ్యాఖ్యలు చేయడం, చిన్ని అనుచరులు పెద్దవరంలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్‌ను ఎమ్మెల్యే పట్టించడం ఎంపీ మరచిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. తిరువూరు నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తే ఎమ్మెల్యే కొలికపూడి, తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ సైతం హాజరు కాకపోవడం ఆ పార్టీలోని గ్రూపు రాజకీయాలకు, చిన్నికి ఇక్కడ ఉన్న విలువకు అద్దం పడుతోందని అన్నారు. తమ సొంత ఇంటిని చక్కబెట్టుకోలేని ఎంపీ వైఎస్సార్ సీపీపై బురద జల్లాలని యత్నించడం తగదని పేర్కొన్నారు.

తిరువూరు నియోజకవర్గ అభివృద్ధి ఏదీ..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరువూరులో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఊదరగొట్టిన ఎంపీ చిన్ని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నియోజకవర్గానికి మంజూరు చేయించలేకపోయారని సత్యనారాయణ విమర్శించారు. వినగడప వద్ద కట్టలేరుపై వంతెన, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన వంటి హామీలు ఎంపీ మరచిపోయారని ఎద్దేవా చేశారు. చిన్ని తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికే మాజీ మంత్రి పేర్ని నానీ, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌లపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ చిన్నికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరసాని ప్రకాష్, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ జాకీర్, రైతు విభాగ అధ్యక్షుడు శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్ తనిఖీ



అన్నవరంలో ఫైర్ వర్క్స్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణ

నూజివీడు: బాణసంచా గోడౌన్‌లో పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు నిబంధనల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ సూచించారు. నూజివీడు మండలంలోని అన్నవరంలో బాణసంచా నిల్వ కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. ఎవరైనా అలాంటి కేంద్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి తీసుకున్న మేర మాత్రమే బాణసంచాను నిల్వ చేయాలన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, అక్రమ బాణాసంచా తయారీ, నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 112కు లేదా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న మిత్రులు

నూజివీడు: నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 1982–83లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని కొన్నంగుంట రోడ్డులో గల తాతినేని సురేష్ గార్డెన్‌లో జరిగింది. కాకినాడ ఏఆర్ ఏఎస్పీగా పనిచేస్తున్న సింగంపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అల్లరి పనులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా సింగంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహించిన మోత్రు శ్యాంబాబు, మరీదు సాంబ, నీలం నాగేశ్వరరావు, షేక్ రెహమాన్‌ను అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరికీ నూతన వస్త్రాలు, మెమెంటోలను అందజేశారు.

సీతారెడ్డిని పరామర్శించిన జోగి రమేష్



సీతారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చామల సీతారెడ్డి తల్లి చామల సీతారావమ్మ ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ సీతారెడ్డి ఇంటికి వెళ్లి సీతారావమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. సీతారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చిలుకూరి రామిరెడ్డి, కొత్తగూడెం పాల కేంద్రం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ సలహాదారుడు సర్నాల తిరుపతిరావు, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయ భాస్కరరెడ్డి, మైలవరం మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు సీతారావమ్మకు నివాళులర్పించారు.

'అమృత మంజరి' అంకురం - 2 పుస్తకావిష్కరణ



అమృత మంజరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజగోపాల చక్రవర్తి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత దేవాశీర్ ఇలారి రచించిన 'అమృత మంజరి' అంకురం – 2(తన ప్రేమగల చేతుల నైపుణ్యం) ఆధ్యాత్మిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం గొల్లపూడిలోని శ్రీపద్మావతి కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మికవేత్త వేదాంతం రాజగోపాల చక్రవర్తి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతి, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ బేధం లేకుండా అందరూ సమానమేనని పేర్కొన్నారు. ఒకే దేవుడు.. ఒకే దేశం నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భగవంతుని జ్ఞానాన్ని అందరూ పొందేందుకు మనుజ్యోతి ఆశ్రమం నిర్వాహకులు అమృత మంజరి పేరుతో పుస్తకాలను ప్రచురించడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ శాంతి కోసం మనుజ్యోతి ఆశ్రమం చేస్తున్న సేవలను కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు చందూరి సీతారామాంజనేయ ప్రసాద్ గురూజీ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, గరికపాటి శివశంకర్, నిడుమోలు రమా సత్యనారాయణ, పీవీ రామన్, పణుకు రాజేష్, సాంబశివరావు, జయప్రకాష్, ఎస్ఎన్ ప్రసాద్, నరేంద్ర, నానాజీ, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని రాష్ట్ర భవన నిర్మాణ రంగ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చి చెప్పుకుందామంటే స్థానిక నేతలు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాష్ట్రంలోని 35 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు ఓట్లేసి గెలిపించాయని గుర్తుచేశారు. ప్రమాదాల బారిన పడిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సహజ మరణానికి రూ.5 లక్షలు ప్రకటించాలని, ప్రసూతి అలవెన్స్ కాన్పుకి రూ.50 వేలు, రెండో కాన్పుకు కూడా రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లలకు పెళ్లికానుక కింద రూ.2 లక్షలు ఇవ్వాలని, చదువుకునే విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే కూటమి ప్రభుత్వంపై రాబోయే రోజుల్లో పోరుబాట పట్టాల్సి ఉంటుందని హరికృష్ణారెడ్డి హెచ్చరించారు.

వరి పైరుకు తెల్ల దోమపోటు

- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు



కె.తాడేపల్లి గ్రామంలో తెల్ల దోమపోటుకు గురైన వరి పైరు

విజయవాడరూరల్: వరి పంట పొలాలకు తెల్ల దోమపోటు తగిలింది. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో వరి పంట పొలాలు ఉమ్మతీత అధికంగా ఉండటం, చిరుపొట్టదశలో ఉండటంతో వరి పంట పొలాల్లో తెల్ల దోమపోటు ఆశించి పసుపు, తెలుపు రంగుల్లో పంట పొలాలు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నున్న, పాతపాడు, విలేజీ కండ్రిక, అంబాపురం, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లోని వరి పొలాలకు తెల్ల దోమ కనబడుతోంది. దీని ప్రభావంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు దిగులు పడుతున్నారు. వర్షాలు వరుసగా కురవడంతో పంట పొలాలకు పూర్తి స్థాయిలో ఎండ తగలడంలేదు. దీంతో ఆకు పీల్చే పురుగు ఆశించడంతో పచ్చగా ఉండాల్సిన పంట తెలుపు రంగులో మారిందని రైతులు అంటున్నారు. బీపీటీ - 5204, 1262 రకం వరిపొలాల్లో ఈ ప్రభావం అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. వరిదుబ్బు మొదళ్లలో ముదురు పచ్చ రంగులో ఉండాల్సింది తెలుపు రంగులో కనిపిస్తోందంటున్నారు.

దోమ పోటుకు చర్యలు చేపట్టాలి..

విజయవాడ రూరల్ మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 9,600 ఎకరాల్లో వరిసాగు జరిగిందని వ్యవసాయాధికారి కె.రఘురామ్ తెలిపారు. తెల్ల దోమ ఉధృతంగా ఉంటే లీటరు నీటికి ఆర్తీన్ మందు 150 నుంచి 200 గ్రాములు, వేప నూనె 300 పీపీఎం లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు.

నేడు అన్నమయ్య గృహసాధన సమితి ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమల కొండపై కూల్చేసిన ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులవారి గృహాన్ని అక్కడే యథాతథంగా యథాస్థానంలో పునర్నిర్మించాలని కోరుతూ శ్రీఅన్నమయ్య గృహసాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. పవిత్రమైన అన్నమయ్య మండపంలో ఆయన స్వహస్తాలతో పూజించిన హనుమంతుని విగ్రహంతోపాటు అన్నమయ్య విగ్రహాన్ని కూడా యథాస్థానంలో ఉన్నది ఉన్నట్లుగా పునఃప్రతిష్ఠించాలని సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లపూడిలోని వెంకయ్య స్వామి ఆలయం నుంచి ఎండోమెంట్ ఆఫీస్ వరకు వివిధ పీఠాధిపతులు, స్వామీజీలు, కళాకారులతో ప్రదర్శనగా బయలుదేరి దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందించనున్నట్లు అన్నమయ్య గృహసాధన సమితి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

నూజివీడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ వర్గాలు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు, బోధనేతర పనులకు ఉపాధ్యాయులను ఉపయోగించవద్దని, కేవలం విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు గడిచినా.. ఇంకా 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ఆగిరిపల్లి: మండలంలోని సగ్గూరులో ఆదివారం వృద్ధులు, బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చారిటబుల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులు, బాలికలకు మినిస్ట్రీస్ డైరెక్టర్ డెన్నీ రాజు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ కె. భాస్కర్ రావు, చౌటపల్లి ఆదాం, మట్టా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య సమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న భక్తులకు ఆరోగ్య సిద్ధితో పాటు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయని పేర్కొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): దసరా పండుగ సందర్భంగా గ్రామంలోని వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహాన్ని గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించి వేదాద్రిలోని కృష్ణానదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న హాకర్స్, వెండర్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ విజయవాడ తూర్పు నగర అధ్యక్ష, కార్యదర్శులు వి.బి.రాజు, ఎన్.కోటబాబు డిమాండ్ చేశారు. స్థానిక రాణిగారితోటలోని గుంటూరు బాపనయ్య భవనంలో ఆదివారం విజయవాడ తూర్పు నగర హాకర్స్ అండ్ వెండర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, కోటబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి చూపించకపోయినా చిరు వ్యాపారులు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వీరి ఉపాధిని దెబ్బతీసి నోటి దగ్గర కూడును లాగేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు ఉపాధి కల్పించకపోగా ఉన్న షాపులు, బండ్లను బలవంతంగా తొలగిస్తున్నారని చెప్పారు. ఫైన్లు వేసి కేసులు నమోదు చేయిస్తున్నారని తెలిపారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వాలు ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్న హాకర్లకు కనీసం బ్యాంకు లోన్లు కూడా ఇవ్వడం లేదన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవిత బీమా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు.

ప్రమాదకరంగా కల్వర్టు



వరద ఉధృతికి పూర్తిగా ధ్వంసమైన కల్వర్టు

ఆగిరిపల్లి: మండలంలోని ఆగిరిపల్లి – నుగొండపల్లి మధ్య కుంపిని వాగుపై ఉన్న కల్వర్టు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఎగువన కురిసిన వర్షాలతో కుంపిని వాగు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహించి కోతకు గురై పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టు మధ్యలో కుంగి గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఈ కల్వర్టును నిర్మించారు. నుగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజవరం, సింహాద్రి అప్పారావుపేటకు చెందిన గ్రామస్తులు ఈ కల్వర్టు పైనుంచి నిత్యం రాకపోకలు సాగిస్తారు. కుంపిని వాగుకు వరద ఉధృతి పెరిగినప్పుడల్లా నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వరద ఉధృతికి ఈ కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గత ఎన్నికల్లో గెలిపిస్తే కుంపిని వాగుపై వంతెన నిర్మిస్తానని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల్లో గెలిచి ఏకంగా మంత్రి కూడా అయిన పార్థసారథి ఇప్పుడు మాత్రం వంతెన ఊసెత్తడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు



పల్లంపల్లి సమీపంలో కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు వైరా ఉపనది



రాకపోకలు సాగించకుండా వైరా కట్టలేరు వద్ద రోడ్డుపై కంప వేసిన అధికారులు

నిలిచిపోయిన రాకపోకలు

వీరులపాడు: గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాలకు వైరా, కట్టలేరు వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వైరా కట్టలేరుకు వరద నీరు చేరడంతో తహసీల్దార్ పాలపర్తి రవికుమార్, ఎస్ఐ అనిల్ వాగును పరిశీలించి రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచారు. ఈ ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రం మధిర వెళ్లేందుకు ఈ మార్గం ఉంది. అందుకే ప్రయాణికుల రాకపోకలు నిలిపివేశారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం..

కూడలి సమీపంలోని వైరా కట్టలేరు ఉపనదిపై గత పాలకులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కానీ ఆ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. దీంతో వర్షాకాలంలో వరద నీరు చేరేటప్పుడు నందిగామ మండలం దాములూరు – వీరులపాడు మండలం పల్లంపల్లి మధ్య ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే తప్ప రాకపోకలు సాగవు. రెండు మండలాలతో పాటు ఈ ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రానికి వరదలు వస్తున్న సమయంలో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు కాని అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో సాగుచేసిన పంట ఉత్పత్తులు ఇళ్లకు చేరవేసేందుకు రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని, ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.